


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### కథ చెప్తానూ "ఊ" కొడ్తావా?

**అనగనగా ఒక కథ. ఎంతో ఆరోగ్యంగా, ఆనందంగా, విన్న వాళ్ళనీ** చూసిన వాళ్ళనీ ఆనంద పరుస్తూ, చిత్ర జగత్తులో సుఖసంతోషాలనిస్తూ, అష్టైశ్వర్యాలతో తులతూగుతూ ఉండేది!

ఒకనాడు తెలుగు సినిమాల్లో కథ మాయమయిపోయింది!

"కథా, కథా ఎందుకు మాయమయిపోయావు?" అని అడిగితే,

"నా రైటర్ ముందుకి సాగనివ్వడంలేదు, హంటర్‌తో కొడుతున్నాడు. దెబ్బలు భరించే ఓపిక లేదు! మాయమయిపోయాను" అంది.

"రైటరూ రైటరూ ఎందుకు కొట్టావు?"

అని అడిగితే "నా డైరెక్టర్, నన్ను రాయనివ్వడం లేదు. అందుకని" అన్నాడు.

"డైరెక్టరూ డైరెక్టరూ ఎందుకు రైటర్ని రాయనివ్వడం లేదు?" అంటే,

"నా హీరోకి నచ్చడం లేదు, నచ్చక పోతే డేట్లు ఇవ్వడు అందుకని" అన్నాడు.

"హీరో హీరో ఎందుకు నచ్చడం లేదు?" అంటే,

"నాకు ఒళ్ళు మాలిష్ చేసి కాళ్ళు పట్టేవాడు మానేశాడు. చిరాగ్గా ఉంది! ఏదీ నచ్చడం లేదు" అన్నాడు.

"మాలిష్ చేసేవాడూ, మాలిష్ చేసేవాడూ ఎందుకు మానేసావు?" అంటే,

"నేనెంత మాలిష్ చేసినా 'బాబు'కి తృప్తిగా ఉండడం లేదండీ, ఆ పక్కనే ఉండి బాజా భజంత్రీ మోగించే వాళ్ళ మాటలే 'సెవ్వనగా' ఉంటున్నాయి. నన్నూ అట్లా అంతహాయిగా ఉండేటట్లు చెయ్యమన్నాడండి" అన్నాడు.

హీరోగారి పక్కనుండే "చెమ్చారాయళ్ళూ, చెమ్చా రాయళ్ళూ ఎందుకు 'బాబు'కి అంత కమ్మగా మాటలు చెపుతున్నార"ంటే,

"దీపం ఉండగానే ఇల్లు చక్కపెట్టుకోవాలి. వీడి ప్లాస్టిక్ సర్జరీలూ, వయసూ, అయిపోతే 'ఫేమ్' ఉండదు. ఆలోగా వీడి డేట్లు ఇప్పించే కమీషన్ వ్యాపారం చేసుకుని మేం బావుపడిపోవాలి. మాకు పోయేదేముందీ, నాలుగు ఉన్నవీ లేనివి వీడి గొప్పలు చెప్పడం, పక్క హీరోల గురించి పది చెడ్డమాటలు చెప్పడమేగా!" అన్నారు.

ప్రొడ్యూసర్ వచ్చాడు. ఎంతమంది సెట్లో భోంచేస్తున్నారో ప్లేట్లు లెక్కపెట్టుకుంటున్నాడు.

బక్క చిక్కిన ఓ చారల చొక్కా వాడిని చూపించి "వీడు మన సెట్లో వాడు కాదే, వీడికి భోజనం పెట్టద్దు" అన్నాడు.

"పాపం. ప్రొద్దుటి నుండీ సెట్ ప్రాపర్టీలు మోసి తెచ్చిన రిక్షావాడండీ.. ఆకలేస్తుంది" అన్నాడు బోయ్.

"వీల్లేదు. వాడి కంచం లాగెయ్యండి" అన్నాడు ప్రొడ్యూసర్.

బక్క చిక్కి ఏ నిమిషానైనా స్పృహ తప్పేట్లున్న ఆ పేదవాడి కంచం లాగేసి, అవతలకి తోసేసారు.

ప్రొడ్యూసర్ పక్కనున్న వాళ్ళతో చెపుతున్నాడు.

"కాశ్మీరు నుండి లారీతో ఏపిల్స్ తెప్పించాం. హీరో, హీరోయిన్లు దొర్లడానికి కోటి అయింది"

"నాలుగు స్టేట్లు దాటించి ట్రక్కుల్లో వైట్ ఎలిఫెంట్లని తెప్పించాం. పాటలో బ్యాక్ గ్రౌండ్‌లో 'ఒక' షాట్ లో చూపించడానికి నాలుగు కోట్లు అయింది"

"హీరోగారు ఫారెన్‌లో ఉన్నప్పుడు అండర్ వేర్, బనీన్లు రోజూ వాడడానికి ముప్పై లక్షలు పెట్టి కొని వాడి పారేసారు."

"కేరళలో సెట్ వేయించాం. రోజుకి నలభై లక్షలు అవుతోంది సాంగ్‌కి రిచ్‌గా తీస్తున్నాం. ఏ హీరో ఇలాంటి పాటలో చెయ్యలేదు"

"మ్యూజిక్ డైరెక్టర్ ఎనిమిది కోట్లు తీస్కుంటున్నాడని విన్నాము... నిజమేనా?"

"నిజమే!"

"మ్యూజిక్ డైరెక్టరూ.. మ్యూజిక్ డైరెక్టరూ మీరు బ్రహ్మాండంగా పాటలు చేస్తున్నారట... కథ విన్నారా?" అని అడిగితే,

"కథా? అదేవిటి? నేను ఎన్ని సినిమాలకి చెయ్యలేదు? నేను సూపర్ హిట్ మ్యూజిక్ డైరెక్టర్ని. నాకు కథతో పనిలేదు. నేను కొట్టేదే మ్యూజిక్. చేసేదే పాట. హీరో ఆడిందే ఆట" అన్నాడు.

"ప్రొడ్యూసరూ ప్రొడ్యూసరూ నీకైనా కథ ఏవైందో తెలుసా?" అని అడిగితే,

"అబ్బా ఉండవయ్యా మా చిన్నదాని బారసాలప్పుడు ఈ హీరోగారికి ఎడ్వాన్స్ ఇచ్చాను. ఇప్పుడు అది పెద్దమనిషయ్యాక, ఈయన డేట్లు ఇచ్చాడు. ఫలానా డైరెక్టరు కాంబినేషన్‌లో అయితేనే చేస్తానన్నాడు. ఆ ఫలానా డైరెక్టరు నాలుగు కోట్లు ఎడ్వాన్స్ తీసుకుని, ఏడాది తిప్పాకా ఇప్పుడు డేట్లు ఇచ్చాడు. అమ్మయ్యా అనుకుంటుంటే, నువ్వొచ్చి ప్రాక్టికల్ నాలెడ్జి లేకుండా 'కథా గిథా' అంటావేంటీ? బాబ్బాబూ కథ గురించి ఎవర్నీ అడగకు. ఎక్కడా మాట్లాడకు. ఎందులో రాయకు. ఉన్నదంతా ఊడ్చి సినిమా తీస్తున్నాను. నువ్వు 'కథ' అని వంక పెట్టావంటే, రోడ్డు మీద పడిపోతాను. ఊర్కో! సినిమా పూర్తవనీ" అని బతిమాలాడు.

"అదేంటయ్యా రేపు సినిమా పూర్తయ్యాక జనం కథ గురించి అడగరా?" అంటే,

ప్రొడ్యూసర్ ఓ నవ్వు నవ్వాడు.

"ఇదేమైనా బి.ఎన్.రెడ్డి, చక్రపాణిగార్ల కాలమా? కనీసం ఆ తరువాతి తరువాతి తరం వాళ్ళ కాలం కూడా కాదు! కథ గురించి కసరత్తులు చేసి రెండేళ్ళు స్క్రిప్ట్ బైండ్ చేసి సెట్ల మీదకి వెళ్ళడానికి!

అది పిచ్చికాలం! కథే సినిమాకి ప్రాణం అనుకునేవారు. కథ తృప్తిగా వచ్చేదాకా హీరో, హీరోయిన్లని డిసైడ్ చేసేవారు కాదు. కథకి ఒక పూర్తి స్వరూపం, ప్రాణం వచ్చాకా, షూటింగ్ స్టార్ట్ చేసేవారు.

ఒకవేళ షూటింగ్ స్టార్ట్ అయినా హీరో, హీరోయిన్లు ఆ పాత్రల్లో ఒదగలేదని అనిపిస్తే, తీసేసేవారు! మిస్సమ్మలో భానుమతి గారిని, అంత ఫేమ్ ఉన్నా మార్చడానికి వెనుకాడలేదు!

కథా రచయితని సినిమాకి తండ్రిలా, ఒకప్రాణం పోసేవాడిలా చూసేవారు. నిర్మాత అంటే ‘మాత‘లా అన్ని శాఖలనీ పర్యవేక్షిస్తూ, కథ బాగా వచ్చేదాకా ఎంతో ఓర్పుగా వేచి ఉండేవాడు. డైరెక్టరు తనకు ఏం కావాలో, కథకి ఎంత ప్రాణం పొయ్యాలో రచయితకి విప్పి చెప్పి, రైటర్‌కి పూర్తి స్వేచ్ఛ నిచ్చేవాడు.

దేవదాసు షూటింగ్ జరుగుతున్నప్పుడు సెట్లో ‘ఎనిమిది‘ దేవదాసు నవలల కాపీలు ఉంచేవారుట చక్రపాణిగారు.

‘మాయాబజార్‘ అనే అతి గొప్ప క్లాసిక్ తీసేటప్పుడు ‘చిన్నమయ‘ అనే పేరు రమణారెడ్డికి పెట్టడానికి వారం రోజులు ఆలోచించి పెట్టారుట! ‘పెద్దమయుడు‘ మయసభ నిర్మించాడు కాబట్టి ‘చిన్నమయ‘ అనే పేరు ‘మాయాబజార్‘ నిర్మించిన వాడికి పెట్టారుట! ఇలా పాత్రలకి పేర్ల కోసం ఆలోచించే ‘పిచ్చి కాలం‘ అది.

రాజకపూర్ సినిమాలకి ‘ఆహ్‘ మొదలయిన వాటికి రెండేసి ముగింపులు చేసేవారుట! ఒకటి రిలీజ్ చేసి, జనాభిప్రాయం తెలిసాక దాని ప్రకారం రెండో ముగింపు జోడించి మళ్ళీ రిలీజ్ చేసేవారుట. అక్కినేని నాగేశ్వరరావుగారి లాంటి నటులు ఎవరైనా వచ్చి ఏ కృష్ణుడి వేషమో వెయ్యమంటే ‘నాకు అలాంటి పర్సనాలిటీ లేదు ఎన్.టి.రామారావు గారి దగ్గరకి వెళ్ళండి‘ అని సిన్సియర్‌గా చెప్పే స్వర్ణకాలం అది! కేవలం ‘కథ‘ వల్ల సినిమా ఆడిన రోజులు అవి. ఇప్పుడు ఆ కథ గురించి ఎందుకయ్యా? ఒద్దు సినిమా ఆగిపోతుంది వదిలెయ్” అన్నాడు.

"అక్కడ సెట్లో పిచ్చి చూపులు చూస్తున్న కుర్రాడు ఎవరండీ?"

"అతనా పాపం రైటరు"

"అతను అలా ఎందుకయ్యాడూ?"

"ఏమో? అతన్నే అడుగు"

"ఏవయ్యా రైటరూ ఇలా వెర్రి చూపులు చూస్తున్నావేం?"

"చెప్పి చెప్పి ఇలా అయ్యానండీ. కథ వినరు. పూర్తిగా నిద్రపోతాడు. ఒకడు చెప్తూ ఉంటే భోజనం కుస్తీ సగం పంపించేస్తారు. సగం ఉండగా"

"ఏవిటయ్యా. ఈ జంబుల్ వర్డ్స్. నీ మెదడుకీ మాటకీ సంబంధం లేదు! అవకతవకలుగా మాట్లాడుతున్నావ్! నువ్వేం కథ రాస్తావ్?"

"ఇదేనండీ వాళ్ళకి కావలసింది! కథలో సీన్లు అన్నీ కుప్పలా పోసి. కొన్ని ఇంగ్లీషు సినిమాల్లో నుండి తీసినవి జోడించి, దీంట్లో సీన్లు కత్తిరించి, కథకి అవసరంలేని శృంగారాన్ని కలిపి, ఫైట్స్ తక్కువయ్యాయని ఏడ్ చేసి, హాస్యం అపహాస్యం అయి కడుపులో దేవేదాకా దీన్లో కుక్కి ముందు పెట్టి, హీరోగారి ‘అనువైనకాలం‘లో పక్కన చెమ్చారాయుళ్ళు ఉండగా వినిపించాలండి. ఆయన మూడ్‌ని పట్టి నవ్వితే ‘ఓ.కే‘ నండీ, పక్కనున్నవాడు ‘ఇది తుళు భాషలో వచ్చిందే! నేను చూసాను‘ అంటే కాన్సిల్ అండి! అంతకు ముందు ఈ బాధంతా ప్రొడ్యూసర్ దగ్గర పడే వెళతాం అండి! వాళ్ళు అయితే మనం కథ చెపుతుంటేనే బడ్జెట్ ఆలోచిస్తుంటారండి! ‘ఒక ప్రోగ్రాం హీరో స్టేజ్ మీద మాట్లాడ్తుంటాడు" అనగానే,

"కట్... జనం... అదీ... ఒద్దు" అంటాడు. "పొట్టి శ్రీరాముల జయంతి. హీరో తెలుగు తల్లి పటానికి మాల వేస్తాడు" అనగానే,

"ఒద్దు. నైజాంలో రిలీజ్‌కి గొడవలు!" అంటాడు.

"హీరోయిన్ కొంగు జారుతుంది. హీరో పట్టుకుంటాడు" అనగానే,

"హీరోయిన్ చీర కట్టుకునేటంత ఓల్డ్ ఫ్యాషనా? ఈ కథ నా కొద్దు" అంటాడు.

ఇలా అడుగడుగునా కథ చెప్పనివ్వకుండా అడ్డుపడే ప్రొడ్యూసర్ ఒకరైతే, మనం కథ చెప్పడం మొదలెట్టగానే, సోఫాలో వెనక్కి జార్లగిలబడి, మెడ గుండ్రంగా తిప్పుతూ నెక్ ఎక్సర్ సైజులు చేసుకునేవాడొకడు. ఆవలిస్తూ కళ్ళు మూసుకునేవాడు ఒకడూ.. ఇంటికి ఫోన్ చేసి పెళ్ళాంతో "ఏం కూరా?" అని అడిగేవాడు ఒకడూ.

పోనీ అక్కడ నెగ్గుకొచ్చామా అంటే, డైరెక్టరు "నా కన్నా పెద్ద రచయితవా? నా దగ్గర ఎన్ని సబ్జెక్టులున్నాయో తెలుసా?" అని తన వెనకున్న కుప్పల సీడీలు, వివిధ భాషల్లోవి చూపించి "తియ్యండిరా బయటికి" అని తన ఘోస్ట్ రైటర్స్‌కి చెప్తాడు.

'క, స్క్రీ, మా, పా, ద.. ఫలానా డైరెక్టరు' అని వేసుకుంటారు సాధారాణంగా. అంటే 'కథా, స్క్రీన్‌ప్లే, మాటలూ, పాటలూ, దర్శకత్వం' అని వేసుకుంటారు.

'నాలుగు కోట్లు ఇస్తున్నాం కదా అన్నీ చెయ్యనీలే అనుకుంటాడు ప్రొడ్యూసర్. కానీ మధ్యలో బలయిపోయేది మాలాంటి రైటర్స్ అండీ!"

"అయితే కథ చచ్చిపోయింది అంటారు! "

"కడుపుచించుకుంటే కాళ్ళమీద పడుతుంది అంటారు. అన్యభాషల్లో స్టాండర్డ్ పెరుగుతూనే ఉంటుంది. మొన్నటికి మొన్న 'త్రీ ఈడియెట్స్', 'జిందగీ నా మిలే దుబారా' సినిమాలు చూసి మన హీరోలూ, ప్రొడ్యూసర్లూ 'అదయ్యా కథ! ' అంటారు. ఆ కథ నాలాంటి రచయిత చెపితే ఆవలిస్తారు. ఒళ్ళు విరుచుకుంటారు!

అదే పేరున్న డైరెక్టర్ వెళ్ళి కూర్చుని,

"ఒక హీరో హోటల్‌లో ఇడ్లీ తింటున్నాడు" అని మొదలెట్టగానే, "అబ్బా! అద్భుతమైన సీనండీ" అంటాడు ప్రొడ్యూసర్.

"హీరోయిన్ బెడ్‌మీద పడుకుని కాలికున్న స్లిప్పర్ విసిరి కొట్టింది" అనగానే, "ఏ స్లిప్పర్ అండీ? స్లిప్పాన్స్ ఆ? షూనా? బ్యాంకాంగ్ నుండీ తెప్పిద్దామా? స్విజ్జర్ లాండ్ నుండి తెప్పిద్దామా?" అంటాడు ప్రొడ్యూసర్.

ఇదీ మన ఇండస్ట్రీ పరిస్థితి. అవతలవాడు ఏది తీస్తే అది కొనడానికి క్యూలో నిలబడతారు. ఎవరికీ వాళ్ళ మీద వాళ్ళకి నమ్మకం లేదు! వేరే భాషలో సక్సెస్ అయితేనే నమ్ముతారు. అది మన ఇండస్ట్రీ నుండి వెళ్ళిన కథే కావచ్చు. అయినా తమిళ్‌లో హిట్. హిందీలో సూపర్ హిట్.. అన్న మాట ముఖ్యం!

ఒక్కొక్క హీరో 'కొత్తదనం కావాలి. నేను అన్నీ చేసేసాను. నావల్టీగా ట్రై చెయ్యండి' అని సగటున రెండొందల కథలు విని, చివరకి రెండు సంవత్సరాలకి రీమేక్ సినిమా చేస్తాడు!

"కొత్తగా ఉంది. రిస్క్ ఎక్కువ. నేను గతంలో చేసిన 'తింగరి డింగరి' సినిమాలో సీన్లు ఉండేలా చేసి తీసుకురండి" అని చేసిన సినిమానే మళ్ళీ చేస్తాడు.

"దుడుకు హిట్ అయిందిట "అనగానే, "అవును. ఒణుకు హిట్ అయింది కాబట్టి ఆ కథే మళ్ళీ తీసాడు. రిస్క్ లేదు. జనంకి అలవాటైన కథ ఆ హీరో మీద చూస్తారు" అంటాడు.

మళ్ళీ ఏటికి 'కడుపు' రెడీ. ఏడుపు మొహంతో చెప్పాడు రైటరు 'కథ చెప్తాను. 'ఊ' కొడ్తావా? అని అడిగితే "ఊహూ కాపీ కొడతాను" అంటాడు డైరెక్టర్.

'కథా కథా ఎందుకు మాయమయిపోయావు?' అని అడిగినందుకు చెంపలు వేసుకుంటూ అతి గొప్ప అద్భుత తెలుగు చిత్రం అని విజయ ఢంకా మోయిస్తున్న రీమేక్ సినిమా లేదా డబ్బింగ్ సినిమా ఎక్కడుందో వెతుక్కుంటూ థియేటర్ దారి పట్టాడు ప్రేక్షకుడు!

కథ కాటికీ...

మనం ఇంటికీ...

సర్వేజనాసుఖినోభవంతు.

Click here to share your comments on this serial

